క్లుప్తంగా

ఈరన్న స్వామికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు దేవాలయం ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

11న కంటి వైద్య శిబిరం

ఎమ్మిగనూరుటౌన్: మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈనెల 11న ఉదయం పట్టణంలోని ఉర్దూ ఫంక్షన్ హాల్‌లో శాంతిరాం కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సమితి నాయకులు హాజీ బడేసాబ్, బందెనవాజ్, హుసేన్ తదితరులు సోమవారం తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారు తమ ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు జిరాక్స్ కాపీలతో హాజరుకావాలన్నారు.

మంచినీటి ట్యాంక్ పునఃప్రారంభం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 9వ వార్డు కలుగొట్ల రోడ్డు సమీపంలో నిరుపయోగంగా మారిన మంచినీటి ట్యాంక్‌ను ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించగా దానిని సోమవారం ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు పునఃప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో నివాసం ఉండే 200 ఎస్సీ, ముస్లిం మైనార్టీ కుటుంబాలు మంచినీటితో ఇబ్బంది పడటాన్ని గుర్తించిన ఎస్‌డీపీఐ నాయకులు విరాళాలు సేకరించి ట్యాంక్‌ను మరమ్మతులు చేయించి నీటి సరఫరాకు పూనుకోవడం అభినందనీయమన్నారు. సామాజిక సేవాకార్యక్రమాల్లో ఎస్‌డీపీఐ పాల్గొనడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎస్‌డీపీఐ జిల్లా కార్యదర్శి హుసేన్‌బాషా, నాయకులు మగ్బుల్, హరున్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ నిర్వహణను రాష్ట్రాలకు అప్పగించాలి

ఆదోని సెంట్రల్: నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతను రాష్ట్రాలకు అప్పజెప్పాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఆఖండ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మను కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. నీట్ పరీక్ష నిర్వహించే జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ నిర్లక్ష్యంగా వ్యవహరించిందని, దీంతో లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని వాపోయారు. పేపర్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపాలని, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ మంత్రి స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి మరోసారి నిర్వహించాలన్నారు. నీట్ పరీక్షను ఆయా రాష్ట్రాలే నిర్వహించే విధంగా ప్రజాప్రతినిధులు అసెంబ్లీలో తీర్మానాలు చేసి చర్యలు చేపట్టాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు మల్లికార్జున, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వామ్ కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న వామ్ సభ్యులు

ఆదోని అర్బన్: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) ఆదోని విభాగానికి అనుసంధానంగా తాడిపత్రి విభాగం ప్రమాణస్వీకారం సోమవారం తాడిపత్రిలో ఘనంగా నిర్వహించారు. 28 మంది కార్యవర్గ సభ్యులు, 15 మంది మహిళా విభాగం సభ్యులు ప్రమాణ స్వీకారం చేసినట్లు ఆదోని పట్టణ వామ్ అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్‌గుప్తా తెలిపారు. 500 మందికి పైగా సభ్యులు సభకు హాజరయ్యారు. ముఖ్య అతిథులు వామ్ గ్లోబల్ ప్రెసిడెంట్ టంగుటూరి రామకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ దిలీప్, అడ్వైజర్ రాజశేఖర్, ఆంధ్ర రాష్ట్ర ప్రెసిడెంట్ సుబ్బరాజు, తెలంగాణ ప్రెసిడెంట్ గురుప్రసాద్, ఆదోని ప్రెసిడెంట్ వంకదారు శ్రీనాథ్‌గుప్తా తదితరులు హాజరయ్యారు. వారి ఆధ్వర్యంలో వామ్ తాడిపత్రి గౌరవాధ్యక్షులుగా సురేంద్ర, గౌరవ చైర్మన్‌గా నాగరాజు, ప్రెసిడెంట్‌గా వంకదారి రాజా, సెక్రటరీగా రామచంద్ర, ట్రెజరర్‌గా రత్నమయ్య, పీఆర్వోగా కార్తికేయ, 25 మంది కార్యవర్గ సభ్యులు, అలాగే వామ్ తాడిపత్రి మహిళా విభాగ్ అధ్యక్షులుగా నాగరత్న, సెక్రటరీగా స్వర్ణలత, ట్రెజరర్‌గా సుబ్బలక్ష్మి, 11 మంది కార్యవర్గం ప్రమాణస్వీకారం చేశారు.

ప్రముఖ జ్యోతిష్యుడి మృతి



రామ్మూర్తి (ఫైల్)

ఆదోని రూరల్: పెద్దతుంబళం గ్రామానికి చెందిన ప్రముఖ జ్యోతిష్యుడు జోషి రామ్మూర్తి శాస్త్రి సోమవారం హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. ఆయన గతంలో ఎస్ఎంకేపీ పాఠశాలలో హిందీ పండిట్‌గా, హెచ్‌ఎంగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు. ఆ తర్వాత జ్యోతిష్యం చెబుతూ సేవలు అందించారు. ఆయన మృతి విషయం తెలుసుకుని బంధువులు, గ్రామస్తులు దిగ్భ్రాంతికి గురయ్యారు.

నిన్ను మరువం రాజన్న

- ఊరువాడా ఘనంగా వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు
- వైఎస్సార్ విగ్రహాలకు పాలాభిషేకం, నివాళులు
- ఆస్పత్రిలో రోగులకు పాలు, బ్రెడ్ పంపిణీ

జన హృదయ నేత రాజన్నను తలచుకుంటూ ఊరువాడా నీరాజనం పలికింది. జోహార్ వైఎస్సార్ నినాదం ప్రతి చోటా ప్రతిధ్వనించింది. రాజన్న సువర్ణపాలనను తలచుకుని ప్రజానీకం జైకొట్టింది. జనమంతా కలిసిరాగా సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి కార్యక్రమం పండుగలా సాగింది. వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు సాగాయి. అలాగే ఊరూరా కేకలు కట్ చేసుకుని మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. కొన్ని చోట్ల వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు, పాలాభిషేకాలు గావించి నీరాజనం పలికారు.

ఎమ్మిగనూరుటౌన్: పేదల కోసం సంక్షేమ పథకాలు తీసుకొచ్చి వారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు బుట్టా ప్రతుల్, సీనియర్ నాయకులు బీఆర్ బసిరెడ్డి, రుద్రగౌడ్, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు పేర్కొన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా సోమవారం పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. అంతకుమునుపు సోమప్ప సర్కిల్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ.. వైఎస్సార్‌హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని వివరించారు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్లు, భూపంపిణీ, రుణమాఫీ, పావలా వడ్డీకే రుణాలు, జలయజ్ఞం లాంటి సంక్షేమ పథకాలకు ఆద్యుడయ్యాడన్నారు. ఆయన పాలన స్వర్ణయుగంలా సాగిందని గుర్తుచేశారు. ఎంపీపీ కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, నాయకులు శివప్పగౌడ్, భీమిరెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, యుకె రాజశేఖర్, షబ్బీర్‌అహమ్మద్,అబ్రార్,తదితరులు పాల్గొన్నారు.



ముగతిలో కేక్ కట్ చేసి సంబరం చేసుకుంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్, కాంగ్రెస్ నాయకుడు దాదాఖలందర్ ఆధ్వర్యంలో పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు. కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గువ్వలదొడ్డి గ్రామంలో నాయకులు పెద్దమల్లేష్, ఉసేని, సిద్దప్ప, రాముడు, గిడ్డెప్ప, నబిసాబ్ పాటు పలువురు నాయకులు జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మన మధ్య లేకపోయినా ఆయన ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు

గోనెగండ్ల:మండల కేంద్రంతో పాటు పెద్దమరివీడు, పుట్టపాశం, హెచ్.కై రవాడి, కులుమాల, పెద్దనేలటూర్, గాజులదిన్నె తదితర గ్రామాల్లో వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించారు. గోనెగండ్లలో వైఎస్సార్‌సీపీ నాయకులు బందెనవాజ్, నాగేష్‌నాయుడు, ఎస్‌బీ మన్సూర్, భాస్కర్ రెడ్డి, మురళి నాయుడు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సర్కిల్‌లో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకొన్నారు. నాయకులు గోవింద్, నాయుడు, డాక్టర్ శివరాం, రఫీ, ఖాజాపటేల్ తదితరులు పాల్గొన్నారు.

నందవరం: మండలంలోని కనకవీడు గ్రామంలో సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, వైస్ ఎంపీపీ నడిపి షేక్‌సాహెబ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. ఆయన మాట్లాడుతూ జలయజ్ఞ భగీరథుడిగా, ఆరోగ్యశ్రీ ప్రధాతగా, రైతన్నల ఆశాజ్యోతిగా వైఎస్సార్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు, తిక్కన్న, సత్యరాజు తదితరులు పాల్గొన్నారు. ముగతి గ్రామంలో సర్పంచ్ విరుపాక్షిరెడ్డి నేతృత్వంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అలాగే హాలహర్వి, నందవరం, నాగలదిన్నె, సోమలగూడూరు, పొనకలదిన్నె, చిన్నకొత్తిలి గ్రామాల్లో వేడుకలు చేసుకున్నారు. నాయకులు రామకోటేశ్వరరెడ్డి, నారాయణరెడ్డి, సావిత్రి, గణపతి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



గోనెగండ్లలో వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కనకవీడులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్ పాలన అజరామరం



మంత్రాలయంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అభిమానులు



కౌతాళంలో..

మంత్రాలయం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలన అజరామరమని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఉద్ఘాటించారు. సోమవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా మంత్రాలయంలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజన్న సంక్షేమ పాలనతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాలతో పేదల కన్నీళ్లు తుడిచారని గుర్తు చేసుకున్నారు. రైతు రుణమాఫీ, విద్యుత్ బకాయిల మాఫీతో వ్యవసాయానికి ఊపిరి పోశారన్నారు. మంత్రాలయం నియోజకవర్గంలో వైఎస్సార్ చొరవతోనే పులికనుమ ప్రాజెక్టు పూర్తి చేశామని వెల్లడించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాలేదన్న ఆందోళన అవసరం లేదని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధైర్య పడవద్దని సూచించారు. టీడీపీ వైఫల్యాలను ఎండగట్టేందుకు సిద్ధంగా ఉందామని పిలుపునిచ్చారు. పార్టీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచు పరమేష్, ఎంపీటీసీ వెంకటేష్‌శెట్టి, వైస్ ఎంపీపీ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, సర్పంచ్ పాల్‌దినకర్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు దాట్ల కృష్ణంరాజు, దాట్ల యూత్ ఆధ్వర్యంలో ఆస్పత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. బదినేహాల్‌లో నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎరిగేరి గ్రామంలో సర్పంచ్ గోవిందు, నీలకంఠరెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఉప సర్పంచ్ తిక్కయ్య, దాట్ల సుబ్బారాజు,రాఘవేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ, ఎంపీపీ ఈరన్న ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. నిరు పేదల సంక్షేమం కోసం వైఎస్సార్ అమలు చేసిన పథకాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. నాయకులు నాడుగేని నాగరాజు, మహంతేష్ స్వామి,మంగమ్మ, వీరస్వామి, జగదీష్ స్వామి, నరసింహులు, ముకుంద కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పెద్దకడుబూరు: మండలకేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి ఇంటి నుంచి కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా వైఎస్సార్ రాష్ట్ర ప్రజలకు చేసిన మేలును కొనియాడారు. నాయకులు చంద్రశేఖర్, నాగరాజు, విజేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దాట్ల యూత్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ



కోసిగిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



పెద్దకడబూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



ఆదోనిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కార్యకర్తలు

మహానేతకు జోహార్లు

ఆదోని టౌన్/ఆదోని సెంట్రల్: పేదల పాలిట పెన్నిధి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ గౌరవాధ్యక్షులు చంద్రకాంత్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు దేవా అన్నారు. ఈ మేరకు సోమవారం జననేత, రైతు బాంధవుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఎస్‌కేడీ కాలనీలోని పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా గౌస్ ఆస్పత్రి రోడ్డులోని వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. క్షీరాభిషేకం, జలాభిషేకం చేపట్టారు. గజమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ అందించిన సువర్ణ పాలనను కొనియాడారు. ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక శక్తులు వికృతాండవం చేస్తున్నాయని, ఇలాంటి దుర్ఘటనలు ఎంతోకాలం సాగవన్నారు. కూటమి ప్రభుత్వం ఎలా ఉందో ఓటర్ దేవుళ్లే చెబుతారన్నారు. అనంతరం స్త్రీలు, పిల్లల ఆస్పత్రి, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (ఏరియా)లో రోగులకు పండ్లు, బ్రెడ్, పాలు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, నాయకులు వెంకటేశ్వరరెడ్డి జిలేకాబీ, అశోక్, ఫయాజ్, సిద్ధ, మల్లికార్జున, చలపతి తదితరులు పాల్గొన్నారు.

– కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వద్ద వైఎస్సార్ విగ్రహానికి జలాభిషేకం చేశారు. రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మారుతిరావు, పట్టణాధ్యక్షుడు సాయినాథ్, దేవిశెట్టి ప్రకాష్ పాల్గొన్నారు. అనంతరం ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లను అందించారు.

ఆదోని రూరల్: మండలంలోని గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. జెడ్పీటీసీ అరుణమ్మ, ఆనంద్, ఎంపీటీసీ శివకుమార్, సర్పంచ్‌లు ప్రహ్లాద, ఉచ్చప్ప, లోహితప్రియ, మహాదేవ, నరసింహులు, బసవరాజు, రాముడు తదితరులు పాల్గొన్నారు.



విరుపాపురంలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న నాయకులు, కార్యకర్తలు



ఆదోనిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఉరుకుందలో సౌకర్యాలు మెరుగుపరచండి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొందని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న అన్నారు. వెంటనే పారిశుద్ధ్య చర్యలు చేపట్టి, భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. జిల్లాలో ప్రాముఖ్యత కలిగిన ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలకు 15 లక్షల మంది భక్తులు తరలివస్తారని, ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆలయ పరసర ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని, ఆలయ వీధుల్లో గుంతలు పడ్డాయని, అన్నదాన సత్రం వద్ద వర్షపు నీరు చేరడంతో పాటు ఆ ప్రాంతం చెత్తచెదారంతో నిండిపోయిందని వెంటనే ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని స్పష్టం చేశారు.

అర్జీలకు సత్వర పరిష్కారం

ఆదోని రూరల్: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తి పరిచేలా చూడాలని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎసెల్‌ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యాలయ పరిపాలనాధికారి సి.ఆర్.శేషయ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌పీఓ నూర్జహాన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ సత్యవతి, ఆర్అండ్‌బీ ఈఈ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ వెంకటప్రసాద్, ఆర్డీ నాగేంద్ర, డీఎల్‌డీఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ

హాస్టల్ వసతి కల్పించాలి

ఆదోని సెంట్రల్: బీసీ బాలికల వసతి గృహం తెరిపించి విద్యార్థులకు వసతి, సౌకర్యాలను కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం సబ్ కలెక్టర్ శివనారాయణ శర్మను కలసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ.. వసతి గృహంలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకుని నెల రోజులు గడుస్తున్నా విద్యార్థులకు సీట్లు కేటాయించకపోవడం విచారకరమన్నారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి వారం రోజుల్లో హాస్టల్ వసతి కల్పిస్తామని చెప్పి నెల రోజులవుతున్నా కల్పించలేకపోయారన్నారు. విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని, లేని పక్షంలో ఆందోళనలకు దిగుతామని స్పష్టం చేశారు. ఎస్ఎఫ్ఐ నాయకులు గౌస్, శశిధర్, మోహన్, నాగరాజు, అమ్రేష్ తదితరులు ఉన్నారు.

కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహిస్తున్న నవోదయ, విక్టర్, టాపర్, విన్నర్, కృష్ణవేణి, ఆజాద్, శ్రీసాయి కోచింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు శేఖర్‌నాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని చిన్నకమేళా వీధిలో సోమవారం ప్రమాదవశాత్తు రఫీక్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు దగ్ధమైంది. కాలనీకి చెందిన రఫీక్ ఉదయం ఇంట్లో పూజ చేసి దీపం వెలిగించి పనులకు వెళ్లారు. ప్రమాదవశాత్తు దీపం కిందపడి మంటలు చెలరేగాయి. ఇంట్లో నుంచి పొగలు రావటంతో చుట్టుపక్కల వారు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్‌ను బయటకు తీసుకొచ్చారు. అగ్నిప్రమాదంలో దుస్తులు, బియ్యం మంటల్లో కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

బీకాం కోర్సును కొనసాగించాలి

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బీకాం జనరల్ కోర్సును కొనసాగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజయేంద్ర డిమాండ్ చేశారు. ఆయన సోమవారం మాట్లాడుతూ..డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. అందులో బీకాం జనరల్ కోర్సును పొందుపరచకపోవడం శోచనీయమన్నారు. బీకాం జనరల్ కోర్సు ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని అలాంటి కోర్సును తొలగించడం సరికాదన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి బీకాం కోర్సును కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్యురాలిపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా పని చేస్తూ ప్రైవేట్‌గా క్లినిక్ నిర్వర్తిస్తున్న వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ, పీడీఎస్‌యూ, పీడీఎస్ఓ నాయకులు రాజు, మహేంద్రబాబు, సురేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఆయా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శేషారెడ్డికి అందజేశారు. వారు మాట్లాడుతూ.. సదరు వైద్యురాలు చికిత్స కోసం వచ్చిన గర్భిణులను సొంత క్లినిక్‌కు రెఫర్ చేసి కాసుల కోసం పీడిస్తోందని, వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రామకృష్ణనాయుడు, ఇమ్రాన్, నరసింహారెడ్డి, తేజ, ఫరూక్ తదితరులు ఉన్నారు.

జంగమ అర్చక సమాఖ్య బైలా ఆవిష్కరణ

ఆదోనిఅర్బన్: ఆదోని డివిజన్ జంగమ అర్చక సమాఖ్య సంఘం బైలా రిజిస్ట్రేషన్ పత్రాన్ని స్థానిక కల్లుమఠం పీఠాధిపతి గురుసిద్దయ్యస్వామి చేతులమీదుగా సోమవారం విడుదల చేశారు. సంఘం బైలా రిజిస్ట్రేషన్ చేయించి ఆ పత్రాన్ని స్థానిక కల్లుమఠం సన్నిధిలో సంఘం గౌరవాధ్యక్షులు విజయ్‌కుమార్ స్వామి, అధ్యక్షులు వీరభద్రయ్యస్వామి, ఉపాధ్యక్షులు శివకుమార్, కార్యదర్శి వీరేష్, సభ్యులు జగదీశ్వరయ్య, విరూపాక్షస్వామి, నాగరాజ్, చెన్నబసయ్య, చంద్రశేఖర్‌స్వామి పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘానికి సంబంధించి బైలా రిజిస్ట్రేషన్ పకడ్బందీగా చేయించి సంఘం అభివృద్ధికి తోడ్పాటునందిస్తామన్నారు.



బైలా విడుదల చేస్తున్న కల్లుమఠం పీఠాధిపతి

మొహర్రం వేడుకలు ప్రారంభం

కౌతాళం: మండల కేంద్రంలో ఆదివారం రాత్రి మొహర్రం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇక్కడ మొహర్రం వేడుకలకు ప్రత్యేక స్థానం ఉంది. నెలవంక కనిపించిన రోజు రాత్రి పీర్ల చావిడిల వద్దకు వెళ్లి ఫాతెహాలు చేసి ప్రారంభం సూచికగా గుద్దేలి వేయడంతో వేడుకలు ప్రారంభమవుతాయి.ఆదివారం రాత్రి ఖాదర్‌లింగ స్వామి దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు భక్తులతో కలిసి దర్గాలో ప్రత్యేక ఫాతెహాల అనంతరం అన్ని పీర్లచావిడిల వద్ద ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. రాత్రి 11 గంటలకు ఇమాం ఖాశీం పీర్లను చావిడిలో ప్రతిష్టించారు. పది రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గుల్షన్ కమిటీ అధ్యక్షుడు చిన్న మున్నపాషా పాల్గొన్నారు.

10న వేలం పాట

గోనెగండ్ల: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన సంతమార్కెట్, బండిమెట్ట, కమేళా తదితర వ్యాపారాలకు సంబంధించి వేలం పాట నిర్వహించినున్నట్లు పంచాయతీ ఇన్‌చార్జ్ ఈఓ సతీష్,సర్పంచ్ హైమావతి తెలిపారు. వారు సోమవారం మాట్లాడుతూ.. బుధవారం ఉదయం 10 గంటలకు వేలంపాట ప్రారంభిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు రూ.20 వేలు డిపాజిట్ చేసి వేలం పాటలో పాల్గొనవచ్చన్నారు.